01ATP24_01ATP24.qxd 24-04-2023 PM 11:37 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 25 ఏప్రిల్ 2023 పేజీలు : 04

జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎత్తుకెళుతున్న పోలీసులు

నాటకీయ పరిణామాల మధ్య

గృహనిర్బంధం

- జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరికలతో పోలీసుల ముందస్తు చర్యలు
- జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఎత్తుకెళ్లి నిర్బంధించిన పోలీసులు

మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య , మీడియాతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, ఏప్రిల్ 24,ప్రభాతవార్త: ఒకప్పుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డాగా ఉన్న తాడిపత్రిలో..అదీ ఆయన స్వగృహం వద్దే సోమవారం తీవ్ర పరాభవం ఎదురైంది. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల అక్రమ ఇసుక, మట్టి తరలింపు వాహనాల విషయంలో చేసిన హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు తీసుకున్న చర్యలు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. పెద్దపప్పూరు సమీపంలోని పెన్నానదిలో అక్రమ ఇసుక తరలింపును అడ్డుకోవాలని హైకోర్టు ఉత్తర్వులున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో తామే ప్రత్యక్ష చర్యలకు దిగుతామని జేసీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. సోమవారం ఆయన పెద్దపప్పూరు ఎస్సైకి ఫోన్‌చేసి అక్కడికి వస్తున్నట్లు చెప్పడంతో తాము అప్రమత్తమవ్వాల్సి వచ్చిందని డీఎస్పీ మీడియాతో చెప్పారు. జేసీ తన ఇంటి సమీపంలో మీడియాతో మాట్లాడుతుండగా డీఎస్పీ చైతన్య సిబ్బందితో వచ్చి జేసీని ఆయన ఇంటిలోకి తరలించాల్సిందిగా ఆదేశించారు. దీంతో సీఐ రామకృష్ణ, ఎస్సై ధరణిబాబులు ప్రత్యేక పోలీసులతో జేసీ ప్రభాకర్‌రెడ్డిని తరలించే ప్రయత్నం చేశారు. అయినా పట్టువదలని పోలీసులు ఆయన్ను ఎత్తుకెళ్లి స్వగృహంలో గృహనిర్బంధం చేశారు. పెద్దపప్పూరు తెదేపా నాయకులను, పట్టణంలోని తెదేపా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంతో జేసీ తరలింపును అడ్డుకునే వారే కరవయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య మీడియాతో మాట్లాడుతూ అక్రమ ఇసుక తరలింపును అడ్డుకోమని హైకోర్టు ఉత్తర్వులున్న మాట వాస్తవమే అయినప్పటికీ ఇలా చట్టాన్ని ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు చేతుల్లోకి తీసుకోమని ఏ కోర్టు చెప్పలేదని వ్యాఖ్యానించారు. తాము అక్రమ ఇసుక రవాణాపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నామో తాడిపత్రి సబ్ డివిజన్‌లో నమోదైన కేసులే నిదర్శమని ఆయన అన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా హెచ్చరికలు జారీ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

75లో నేనొక్కడినే గెలిచా..!
-జేసీ ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్రంలోని 75 మున్సిపాలిటీల్లో నేనొక్కడినే గెలిచాను. నా విధులు నన్ను నిర్వర్తించనీయండి. మీరంతా చదువుకొని విధుల్లోకి వచ్చారు. అది దేవుడిచ్చిన వరం మీకు. ఈ పురపాలకాన్ని రక్షించండి. శాంతి భద్రతల పేరుతో పోలీసులు ఇలా వ్యవహరించడం సరికాదు. మున్సిపాలిటీ కార్యాలయంలోకి వెళ్లకుండా గృహనిర్బంధం చేయడం సమంజసం కాదు. మున్సిపాలిటీల ప్రస్తుతమున్న వాహనాలన్నీ నేనిచ్చినవే. నేను వేతనం కూడా తీసుకోకుండా పనిచేస్తున్నాను. రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్నాను. 14 టైర్లు ఎత్తుకెళ్లి పోతే ప్రశ్నిస్తే లా అండ్ ఆర్డర్ అంటారా..? పోలీసులు ఎందుకు అక్రమాలు ఆపడం లేదు.

పరిశుభ్రత, ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దండి

ఉత్తమ పంచాయితీ అవార్డును అందిస్తున్న కలెక్టర్, జడ్పి చైర్మన్

- ప్రజల కనీస అవసరాలు తీర్చాలి : జిల్లా కలెక్టర్ గౌతమి
- దేశానికి ఆదర్శం సచివాలయ వ్యవస్థ : జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చి ఆదర్శ పంచాయితీగా తీర్చి దిద్ది ప్రజల కనీస అవసరాలు తీర్చే దిశగా పంచాయితీ పాలక వర్గాలు పని చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగానిర్వహించారు. జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాక లెక్టర్ గౌతమి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలలో స్వయం ఆదాయ పెంపు దిశగా పాలక వర్గాలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్స్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆధారపడకుండా పంచాయితీలలోనే సంపదను సృష్టించుకుని ఆదాయం సమకూర్చుకునే దిశగా పాలక వర్గాలు పని చేయాలన్నారు. పట్టణాలతో పోల్చుకుంటే గ్రామాలలో ఐక్యత ఉంటుందని, ఐక్యతను సద్వినియోగం చేసుకుని సమిష్టి నిర్ణయాలు తీసుకుని గ్రామలు అభివృద్ధి దిశగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్యం రాక మునుపు నుంచి ఉన్న గ్రామస్థాయి పరిపాలన ఆలోచనను మరింత ముందుకు తీసుకెళ్తూ సచివాలయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గతంలో ఏదైనా సమస్య ఉంటే మండల కేంద్రానికో, జిల్లాకేంద్రానికో ప్రజలు వెళ్లే పరిస్థితి ఉండేదని, నేడు అందుకు భిన్నంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సమస్యలను స్థానికంగా పరిష్కరిస్తున్నారన్నారు. జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి గ్రామాలలో ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత పంచాయితీల పాలక వర్గాలపైనే ఉంటుందన్రు. గ్రామాలు, మండలాలు, జిల్లాలు అన్న తేడాల ఏకుండా అన్ని స్తాయిల్లోనూ అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షగా పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పంచాయితీలుగా ఎంపికైన పాలక వర్గాలకు జడ్పి చైర్మన్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జడ్పి చైర్మన్ చేతులు మీదుగా ఉత్తమ పంచాయితీలుగా ఎంపికైన అనంతపురం రూరల్ మండల పరిధిలోని కక్కలపల్లి, ఉరవకొండ మండల పరిధిలోని ఇంద్రావతి గ్రామీణ సర్పంచులు, కార్యదర్శిలు అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో జడ్పి సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజ్, డిపిఓ ప్రభాకర్, పంచాయితీ రాజ్ ఎస్ఇ భాగ్యరాజ్, డిఆర్‌డిఏ పిడి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కార నాణ్యతకు
ఆడిటింగ్ టీంలు ఏర్పాటు చేయండి
- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

గ్రీవెన్స్ అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

శ్రీసత్యసాయి జిల్లా, ఏప్రిల్ 24, ప్రభాతవార్త ప్రతినిధి: స్పందన గ్రీవెన్స్ అర్జీలకు సంబంధించి పరిష్కరించిన అనంతరం నాణ్యత విషయంలో పరిశీలన చేసేందుకు మండల స్థాయి ఆడిటింగ్ టీంలను ఏర్పాటు చేసి ఆడిటింగ్ నిర్వహించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆయాశాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డిఆర్‌ఓ కొండయ్య, ఆర్‌డిఓ భాగ్యరేఖ, వివిధశాఖల అధికారులతో కలసి జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజల నుండి 201 అర్జీలను స్వీకరించారు. అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రీవెన్స్‌లో అన్ని శాఖల అధికారులంతా కలసి కూర్చుకొని కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి సామూహిక గృహ ప్రవేశాల్లో భాగంగా మే రెండవ వారానికి రాష్ట్ర వ్యాప్తంగా 3.75 లక్షల ఇళ్ళు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్ణయించగా, జిల్లాకు 10,658 ఇళ్ళు పూర్తి చేయాలని లక్ష్యంగా కేటాయించడం జరిగిందని 10 రోజుల్లోపు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఈ విషయంలో హౌసింగ్ డిఇలు పరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌ల భవన నిర్మాణాలకు సంబంధించి 73 నిర్మాణాలు బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్నాయని, వాటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 0-5, 5-19 యేళ్ళ వారి ఆధార్ అప్‌డేట్‌ను ఎలాంటి పెండింగ్‌లేకుండా పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలన్నారు. అమ్మఒడి, జగనన్న తోడు తదితర పథకాలకు సంబంధించి అక్నాలజ్మెంట్‌కార్డులను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. కన్సిస్టెంట్ రిథమ్ క్రింద పాఠశాలల తనిఖీ పూర్తి స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ క్రింద జిల్లాకు 65 వేల మంది కూలీలకు పనులు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా, 59 వేల మందికి పనులకు వస్తున్నారని, వారంరోజుల్లోపు పూర్తి స్థాయిలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించి లక్ష్యంచేరుకోవాలన్నారు. అమృత్ సరోవర్ క్రింద జిల్లాలో 48 చెరువుల్లో ఇంకా పనులు చేపట్టాల్సి ఉందని, సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం క్రింద మజూరైన మొదలు కాని పనులు వెంటనే మొదలు పెట్టాలని, రీ సర్వే క్రింద ఎంపిక చేసిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ కోసం 2 వేల రాళ్ళు రావడంజరిగిందని, ఈ విషయమై ఆర్‌డిఓలు దృష్టి సారించి అవసరమై రోవర్స్ ఏర్పాటు చేసుకొని ఎక్కువ టీములతో రెండు రోజుల్లోపు స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. మనబడి నాడు-నేడు క్రింద జిల్లాలో రెండవ విడత భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌కు సంబంధించి రీ ఓపెన్ కేసులు 15 ఉన్నాయని, అధికారులు అందించే ఎండార్స్‌మెంట్ అర్జీదారుడికి అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. అర్జీలు మళ్ళీ రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. స్పందన గ్రీవెన్స్ అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపించాలని, బియాండ్ ఎస్ఎల్ఎలు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్ "ఎ డ్రగ్ ఫ్రీ స్టేట్" అంటూ జిల్లా అధికారులచేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పిడి చంద్రమోహన్ రెడ్డి, డ్వామాపిడి రామాంజినేయులు, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డిఆర్‌డిఏ పిడి నరసయ్య, డిపిఓ విజయ్‌కుమార్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి శిరంగ ప్రసాద్, డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా.ఎం.తిప్పేంద్రనాయక్, డిఇఓ మీనాక్షి, డిసిఓ కృష్ణానాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, చేనేత జౌళి శాఖ ఎడి రమేష్, పట్టు పరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కట్టకిందపల్లి గ్రామ సర్పంచ్ సేవలు అమోఘం
రాజకీయ నాయకులు,పంచాయితీ అధికారులు,కుల సంఘ నాయకులు

కమిషనర్ సూర్య కుమారి చేతులు మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ భోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డి.

రాష్ట్ర స్థాయి ఉత్తమ సర్పంచ్ ఆవార్డు అందుకున్న వారితో కమిషనర్ సూర్య కుమారి

అనంతపురం రూరల్,ఏప్రిల్24ప్రభాతవార్త: కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజల అవసరాలకనుగుణంగాఎప్పటికప్పుడు తన సిబ్బందిని సమన్వయం చేస్తు అంకిత భావంతో విధులు నిర్వహిస్తు అనంత మండలం కట్టకిందపల్లి గ్రామ పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తూన్న సర్పంచ్ భోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డి సేవలు అమోఘమని పలువురు రాజకీయ నాయకులు,పంచాయితీ అధికారులు,వివిధ సంఘాల నాయకులు,మిత్రులు కొనియాడడం జరిగింది. గ్రామంలో సిసి రోడ్లు,డ్రైనేజీ కాలువలు, గ్రామంలో ఇంటింటికి తాగునీటీ కుళ్లాయి అందించడం,గ్రామంలో నివాసంచే ప్రజలకు ఎవరు ఆనారోగ్యం పాలుకాకుండా డ్రైనేజీ కాలువులు శుభ్రం చేయించి గ్రామంలోని వీధులు మొత్తం పాగింగ్ నిర్వహించి ప్రజల ఆరోగ్యంను కాపడడం ఇలాంటీ అనేక కార్యక్రమాలు నిర్వహించి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన ఇమె చేసిన సేవలను జిల్లా ,రాష్ట్ర పంచాయితీరాజ్ యంత్రాంగం గుర్తించి సోమవారం జరిగిన 30వ జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలో అనంత రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామ సర్పంచ్ బోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డికి ఉత్తమ సర్పంచ్‌గా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పంచాయితీ కార్యదర్శి సర్దార్‌వలి, పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేస్తు ప్రజల సమస్యలను ఎప్పటీకి అప్పుడు పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించి గ్రామాన్ని ముందుకు తీసుకపోతున్న నా సేవాలను గుర్తించి పంచాయితీరాజ్ శాఖ అధికారులు ఈ నెల 24న పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్య కుమారి చేతులు మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ అవార్డు తనకు రావడంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి,జెడ్పీ అధికారులు, అనంత రూరల్ మండల పరిషత్ కార్యాలయ అధికారుల సహాయ సహకాలు అందించడంతోనే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకపోవడం జరిగిందని నాకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డు రావడంలో వీరి అందరి కృషి ఉందన్నారు.ఈ అవార్డుతో మరింత ఉత్సహంతో ప్రజలకు సేవలు అందించి గ్రామాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపిస్తాన్నారు.

రెమ్యునరేషన్ పెంచారు సరే...అదనపు బడ్జెట్ ఏదీ?

- పదో తరగతి పరీక్షలు,మూల్యాంకనంకు పాత రేట్లతోనే బడ్జెట్ విడుదల - తాజాగా రెమ్యునరేషన్‌ని పెంచుతూ జీవో 37ని విడుదల చేసిన ప్రభుత్వం - రేపటితో ముగియనున్న మూల్యాంకనం ప్రక్రియ - అయోమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులు



రెమ్యునరేషన్ పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం కి సంబంధించిన రెమ్యునరేషన్‌ని పెంచారు. కానీ అదనపు బడ్జెట్‌ను విడుదల చేయకపోవడం గమనార్హం. రేపటితో మూల్యాంకనం ప్రక్రియ పూర్తి అవుతుండటంతో ఏ రేట్ల ప్రకారంగా రెమ్యునరేషన్‌ని చెల్లించాలో తెలియక ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

అనంతపురం జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల నిర్వహణకు దాదాపు 900 మంది సిబ్బందిని నియామించారు. అలాగే ఈనెల 19 నుంచి నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పది మూల్యాంకనం ప్రక్రియ కూడా ప్రారంభమైంది. దాదాపు 2.10 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. ఈ ప్రక్రియకు ఏసిఓలు, సిఈలు, ఏఈలు దాదాపు 1300 మందిని నియామించారు. పాత రెమ్యునరేషన్ రేట్ల ప్రకారం దాదాపు రూ.80 లక్షల బడ్జెట్ మంజూరు అయ్యింది. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి పదో తరగతి పరీక్షల నిర్వహణకు దాదాపు 900 మంది సిబ్బందిని నియామించారు. మూల్యాంకనం ప్రక్రియ కూడా కొత్త చెరువు బాయ్స్ హైస్కూల్లో కొనసాగుతుంది. ఈ ప్రక్రియకు దాదాపు 1200 మంది సిబ్బందిని నియామించారు. రెమ్యునరేషన్ పాత రేట్లతో దాదాపు రూ.50 లక్షల బడ్జెట్ మంజూరు అయ్యింది.

పెరిగిన రెమ్యునరేషన్ రేట్లు : పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంకు సంబంధించిన రెమ్యునరేషన్ రేట్లను ప్రభుత్వం పెంచుతూ ఈనెల 20న జీవో నెం:37ని విడుదల చేసింది. సిఎస్-డివోలకు ఒక రోజుకు గతంలో రూ.44 రుపాయిలు ఉంటే దానిని 66కి పెంచారు. ఇన్విజిలేటర్, క్లర్క్, మెడికల్ స్టాఫ్‌కు రూ.22 నుంచి 33కి, అటెండర్‌కి రూ.13.20 నుంచి 20కి, వాటర్‌మ్యాన్‌కి రూ.11నుంచి 17కి, జిల్లా అబ్జర్వర్‌కి రూ.200లు నుంచి రూ.300కి, కంటెన్‌జెన్సీ ఒక స్టూడెంట్‌కి రూ.8 నుంచి పది రుపాయిలకు పెంచారు. అలాగే మూల్యాంకనం కేంద్రం క్యాంప్ ఆఫీసర్‌కి ఒక రోజుకు గతంలో రూ.385 ఉంటే దానిని 578కి పెంచారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కి రూ.330 నుంచి 495కి, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కి రూ.286 నుంచి 429కి, సిఈలకు రూ.264 నుంచి 396కి, ఏఈలకు ఒక పేపర్‌కి రూ.6.60 నుంచి పది రుపాయిలకి పెంచారు. స్పెషల్ అసిస్టెంట్లకు రూ.137.50 నుంచి 300కి , క్లర్క్‌కి రూ.88 నుంచి 132కి, ఓఎస్‌లకు రూ.88 నుంచి 132కి , సిడివోలకు రూ.220 నుంచి 330కి, ఏసిడివోలకు రూ.198 నుంచి 297కి ,టెర్నింగ్ పార్ట్-1కి రూ.17 నుంచి 30కి, ఎగ్జామినర్ ఫర్ ప్రిన్సిపాల్స్ ఆఫ్ వాల్యూషన్స్‌కి రూ.250 నుంచి 375 రుపాయిలకు పెంచారు.

అయోమయంలో ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు : పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం ప్రక్రియకు సంబంధించిన రెమ్యునరేషన్‌ను పాత రేట్లతోనే ప్రభుత్వం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు బడ్జెట్‌ను విడుదల చేసింది. అయితే రెమ్యునరేషన్ రేట్లను ప్రభుత్వం పెంచుతూ తాజాగా జీవోను విడుదల చేసింది. పదో తరగతి పరీక్షల నిర్వహణ ఇప్పటికే ముగిసింది. ఇక మూల్యాంకనం ప్రక్రియ కూడా బుధవారంతో ముగియనుంది. అయితే రెమ్యునరేషన్‌ని పాత రేట్లతో చెల్లిస్తే మంజూరు అయిన బడ్జెట్ సరిపోతుంది. కొత్త రేట్లతో చెల్లించాలంటే అదనపు బడ్జెట్ కావాల్సి వుంది. అయితే రెమ్యునరేషన్‌ని ఏ రేట్లు ప్రకారంగా చెల్లించాలన్నది సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి నేటికి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులు అయోమయానికి గురవుతున్నారు. దీనిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

అదనపు బడ్జెట్ కోసం లెటర్ రాస్తాము: అనంతపురం జిల్లా డీఈవో యం.సాయిరామ్

పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంకు సంబంధించిన రెమ్యునరేషన్ పాత రేట్లతోనే బడ్జెట్ వచ్చింది. అయితే ఆ రేట్లను పెంచుతూ ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ప్రస్తుతం పాత రేట్లతోనే రెమ్యునరేషన్ చెల్లిస్తాము. అదనపు బడ్జెట్ కోసం ఉన్నతాధికారులకు లెటర్ రాస్తాము. ఆ బడ్జెట్ వచ్చిన తర్వాత మిగిలిన రెమ్యునరేషన్‌ను చెల్లిస్తాము.

పాత రేట్లతోనే రెమ్యునరేషన్ చెల్లిస్తాము : శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవో మీనాక్షి

పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంకు సంబంధించిన రెమ్యునరేషన్ రేట్లను ప్రభుత్వం పెంచింది. అయితే పాత రేట్లకే బడ్జెట్ వచ్చింది. కొత్త రేట్ల ప్రకారంగా అదనపు బడ్జెట్ అవసరం. అదనపు బడ్జెట్ కోసం ఉన్నతాధికారులకు లెటర్ రాస్తాము. ప్రస్తుతం పాత రేట్లతోనే రెమ్యునరేషన్ చెల్లిస్తాము. అదనపు బడ్జెట్ వచ్చిన తర్వాత మిగిలిన రెమ్యునరేషన్ చెల్లిస్తాము.

మూల్యాంకనం చేస్తున్న దృశ్యం

పంచాయతిరాజ్‌తోనే దేశ నిర్మాణం...ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

డి.హిరేహాళ్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త : దేశ నిర్మాణం కోసం పంచాయతీరాజ్ వ్యవస్థ రూపు దిద్దుకుందని ఇది మూడంచల పద్ధతిలో అభివృద్ధికి తార్కాణమైందని ఎంపీడీఓ భాస్కర్ బాబు తెలిపారు. సోమవారం డి.హిరేహాళ్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతిరాజ్ దినోత్సవంను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచిలు గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని పంచాయతీ అభివృద్ధికి బాటలు వేసి ప్రజలకు ఆరోగ్య వంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పంచాయతిరాజ్ తోనే ప్రజల ఆరోగ్య ముడిపడిందని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు విషయమై ప్రజలను చైతన్య వంతం చేయాల్సిన బాధ్యత సర్పంచిలదేనని సర్పంచిలు దీన్ని ఓ ఉద్యమంలా చేయాలని ఆయన చెప్పారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఈ మూడంచెల పద్ధతిని పాటించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం మెరుగు పరచడం లాంటి అభివృద్ధితో ప్రజలను ఆరోగ్య వంతులను చేయగలితే వృథా ఖర్చును ఆదాచేసి పరిపూర్ణమైన జీవన సరళిని కొనసాగించవచ్చని అందుకు సర్పంచులు, పంచాయతీరాజ్ ఉద్యోగులు నడుంబిగించాలని ఆయన పిలుపునిచ్చారు. పంచాయతిరాజ్ తోనే ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందన్నది సర్పంచిలు, పంచాయతి కార్యాలయాల సిబ్బంది గమనించి ప్రజల ఆరోగ్యంకు పెద్దపీట వేయాలని తహశిల్దారు బసవకుమార్, ఎంఈఓ తిమ్మప్ప, ఈఓఆర్డీ బలరాంరావు తెలిపారు. సచివాలయాల సిబ్బంది రాజు, హరీష్, ఎంపిటీసీ గంగాధర, సర్పంచి రుద్రేష్ పంచాయాతిరాజ్ నిర్మాణం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది మహేష్, రామచంద్ర, నాగప్ప, ఉపాధి హామీ పథకం ఏపీఓ ఓబులప్ప. సాంకేతిక సిబ్బంది శ్రీనివాసులు, నరసన్న, సుధాకర్, ఆపరేటర్ రామాంజి, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు బుగుట ఎరిస్వామి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంకు హాజరైన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

ఘనంగా బసవ జయంతి వేడుకలు

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 24 ప్రభాతవార్త, : మండలంలోని పోలేపల్లి గ్రామంలో వీరశైవులు బసవ జయంతిని ఘనంగా నిర్వహించారు.ప్రత్యేక పూజలతో జయంతి నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ వీరశైవులంతా ఐఖ్యతతో మెలిగి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. వీరశైవుల ఇళ్ళకు ప్రతి ఇంటికి బసవేశ్వర చిత్రఫటాన్ని అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి మధ్యహ్నం బసవేశ్వర చిత్రఫటాన్ని ఊరేగింపుతో గ్రామవీధులవెంట ప్రత్యేక నృత్యాలతో మంగళవాయిద్యాలతో నిర్వహించారు.

ఘనంగా జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 24 ప్రభాతవార్త. : ఘనంగా జాతీయ పంఛాయితీ రాజ్ దినోత్సవంను పురష్కరించుకొని ఎంపిపి అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిటీసీలు,సర్పంచ్‌లు,పంఛాయితీ కార్యదర్శులు అధికారులు కలిసి మహాత్మా గాంధీ చిత్రఫటానికి పూలమాలవేసిన అనంతరం ప్రార్థన నిర్వహించి జాతీయ గ్రామీణాభివృద్ధి పంఛాయితీరాజ్ జాతీయ పంఛాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపిపి కంభం చంద్రశేకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి పంఛాయితీలలో అభివృద్ధి పనులను గుర్తించి ప్రజాసమస్యలను పరిష్కరించాలని అన్నారు.అనంతరం జడ్‌పిటీసి ప్రభావతి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి వసతులను ప్రజలకు సమర్థవంతంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ వెంకట్‌నాయుడు,ఎంఈఓ ఓబుళపతి,వైసీపి కన్వినర్ బసవరాజు,అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిడీఓ వెంకట్‌నాయుడు కస్తూరిబాగాంధీ పాఠశాలలో కలెక్టర్ గౌతమి అదేశాల మేరకు చలివేంద్రంను ఏర్పాటుచేశారు.

చలివేంద్రం ఏర్పాటు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దారు

బెలుగుప్ప, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం ఆవరణంలో చలివేంద్రం తహశీల్దారు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ. కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవి కాలంలో కార్యాలయానికి వస్తున్న రైతుకలు, ప్రజలకు, పిల్లలకు చలివేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు పీరాసాబ్, ఆర్ఐ నగేష్‌బాబు, సచివాలయ ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి

మృతి చెందిన చంద్రకళ

బెలుగుప్ప, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండల పరిధిలో కాలవపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ(40) వేరుశనగకాయల మిషన్ ప్రమాదంలో కింద పడి మృతి చెందింది. వివరాల మేరకు.. సోమవారం ఉదయం 6గంటలకు కాలవ పల్లి నుంచి అనంతపురంకు వెళ్తున్న చెనిక్కాయల మిషన్‌పై కూర్చుని ఉండగా అదుపు తప్పి బోల్తా పడటంతో వెనకటైరుకింద పడి మృతి చెందింది. ఈమెకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి ఎస్ఐ రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

26న వాహనాల వేలం

శెట్టూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : శెట్టూరు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయబడిన వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 10 మోటార్ సైకిల్స్, ఒక ఆటో వాహనాలకు ఈనెల 26వ తేదిన ఉదయం 11 గంటల నుంచి శెట్టూరు పోలీస్ స్టేషన్ వద్ద ఎన్‌ఫోర్స్ మెంట్ సూపరింటెండెంట్ వారి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ వేలంలో పాల్గొన దలచిన వారు బుధవారం ఉదయం 9 గంటలకు ఆధార్‌కార్డు, పాన్‌కార ఉడ కాపీలతో శెట్టూరు పోలీస్‌స్టేషన్ వద్దకు హాజరై 3వేలు దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం పాటలో వాహనాలను పొందిన వారు వెంటనే ప్రభుత్వానికి సదరు వేలం పాట నగదును, జిఎస్‌టతో కలిపి చెల్లించాలని తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న కంకర టిప్పర్లను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

పోలీస్‌స్టేషన్ ఆవరణలో కంకర టిప్పర్

బొమ్మనహాల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండల పరిధిలోని నేమకల్లు గ్రామ సమీపంలోగల కంకర క్వారీల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న మూడు కంకర టిప్పర్లను సోమవారం విజిలెన్స్ సిఐ రామారావు, వారి బృందం పట్టుకుని కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వాహనాలను సీజ్ చేసి బొమ్మనహాల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు తెలిపారు. అంతేకాకుండా ఆంధ్ర నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, కంకర, సైజు రాల్లు, బోల్డర్స్ రాళ్లు, ఎవరైనా కర్ణాటకకు తరలిస్తే వారిపై క్రిమినల్ కేసులు, జరిమానా, వాహనాల సీజ్ తప్పకుండా ఉంటుందని అక్రమ వాహన దారులను హెచ్చరించారు. ప్రభుత్వ ట్రిప్‌షీట్‌పొంది జీఎస్‌టి చెల్లించి అనుమతులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వాటి టీం బృందం పాల్గొన్నారు.

మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించండి

-జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

మలేరియా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీసత్యసాయిజిల్లా(విద్యం), ఏప్రిల్ 24, ప్రభాతవార్త

మలేరియా వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, ఆ విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రపంచ మలేరియా దినోత్సవంను పురస్కరించుకొని మలేరియా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మలేరియా వ్యాధి నిర్మూలన కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు. ఇంటిముంగిట మురికి కాలువలో చెత్తాచెదారం వేయకూడదని, మురుకునీరు ఎప్పుడూ పారేటట్లు చూడాలని, ఇంటిపరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మురికి నీరు నిల్వలో వారానికి ఒకసారి కిరోసిన్, ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల పుట్టకను నివారించాలన్నారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్తలు, చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ ఓ డాక్టర్.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిసిఎంఓ డాక్టర్ కుళ్ళాయప్ప నాయక్, డిసిహెచ్ఎస్ డా.ఎం.తిప్పేంద్ర నాయక్, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు ప్రశంసా పత్రాలు

- ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

ఎంపిడిఓచేతుల మీదుగా ప్రసంసా పత్రం అందుకుంటున్న సర్పంచ్ దృశ్యం

కొత్తచెరువు, ఏప్రిల్ 24, ప్రభావార్త : ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పంచాయతీలో ఉత్తమ సేవలు అందించినందుకు కొడపగానిపల్లి, తిరుమలదేవరపల్లి, నాగిరెడ్డి పల్లి గ్రామ పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా గుర్తించినట్లు ఎంపిడిఓ సిద్దారెడ్డి తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవంను స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలు కొడపగానిపల్లి సర్పంచ్ అలివేలమ్మ, తిరుమలదేవరపల్లి సర్పంచ్ కేశవరెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సంజీవరాయుడలకు పంచాయతీ సెక్రెటరీ గంగాదర్ రెడ్డిలు ఎంపిడిఓ కార్యాలయం నందు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అలివేలమ్మ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ సేవలు అందించినందుకు మండలంలో మూడు అవార్డులు దక్కినట్లు ఆమె తెలియజేశ2ళరు. అవి ఏమంటే మంచినీటి సౌకర్యం, పేదరిక నిర్మూలన, ఆరోగ్య కరమైన పంచాయతీగా తీర్చిదిద్దినందుకు అవార్డులు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఒక మహిళగా తనను రెండవ సారి సర్పంచ్‌గా ఎన్నుకోవడం, గ్రామాభివృద్ధి కోసం సేవ చేయడమే తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలియజేశారు.ఇందుకు సహకరించిన పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి, గ్రామ ప్రజలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తున్న వాలంటీర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇక ముమ్ముందు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలియజేశారు.

చలివేంద్రం ఏర్పాటు... ఎంపిడిఓ కార్యాలయంకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణం నందు ఎంపిపి గాయత్రి, రెడ్డపరెడ్డిల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కృష్ణలత తదితరులు పాల్గొన్నారు.

సెస్‌బకాయిలు సకాలంలో చెల్లించాలని ఎంపిడిఓకు వినతి

ఎంపిడిఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రంథాలయ అధికారి జయరాం

కొత్తచెరువు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త : గ్రంథాలయానికి రావాల్సిన సెస్ బకాయిలను సకాలంలో చెల్లించాలని ఎంపిడిఓ సిద్దారెడ్డికి గ్రంథాయల అధికారి జయరాం కోరారు. ఈ మేరకు ఉమ్మడి శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల గ్రంథాలయ ఛైర్ పర్సన్ ఉమామోహన్ రెడ్డి ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, డిపిఓలను కలసి జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలలో సెస్ బకాయిలను చెల్లించాలని కోరడంజరిగిందన్నారు. కావున సత్వరం గ్రంథాలయాలకు సెస్ బకాయిలను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై ఎంపిడిఓ స్పందిస్తూ ఈ నెల 26వ తేదిలోపు మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసుకొని గ్రంథాలయ సమస్యకు అందించాల్సిన సెస్ బకాయిలను ఖాతాలలో జమ చేసేందుకు కృషి చేస్తామన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

-వరుసగా 3వ నెలలో 40 మంది వ్యాధిగ్రస్థులకు అందజేత

పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉరవకొండ ప్రాంతానికి చెందిన 40 మంది క్షయ వ్యాధిగ్రస్థులకు వరుసగా 3వ నెల పౌష్టికాహారం కిట్లను సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ స్టడీ, యోగ కేంద్రంలో క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్షయ వ్యాధిగ్రస్థులకు నెలరోజులకు సరిపడా నిత్యవసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సప్తగిరి మల్లికార్జున మాట్లాడుతూ క్షయ వ్యాధి నుండి రోగులు త్వరగా కోలుకోవడానికి వైద్యులు అందించే మందులతోపాటు పౌష్టికాహారం కూడా ముఖ్యమని అందుకే క్లబ్ సభ్యులు, దాత సహకారంతో 6 నెలలపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బి.లక్ష్మినారాయణ, ప్రతినిధులు టి.గణేష్‌బాబు, యేళ్ల ప్రభాకర్‌నాయుడు, సి.నాగేశ్వరరావు, ప్యాపిలి జయన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రావతి, బూదగవిలకు ఉత్తమ పంచాయతీ అవార్డులు

-కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా అందుకున్న సర్పంచులు, కార్యదర్శులు

ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకొంటున్న ఇంద్రావతి సర్పంచ్ సి.సువర్ణ, కార్యదర్శి ఎ.వి.రమణకుమార్, అవార్డు అందుకొంటున్న బూదగవి సర్పంచ్ డి.లక్ష్మిదేవి

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఇంద్రావతి, బూదగవి గ్రామ పంచాయతీలు ఉత్తమ పంచాయతీ అవార్డులను అందుకున్నాయి. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం పంచాయతీలకు అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి.గౌతమి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ కె.భాస్కర్ రెడ్డి, అడిషనల్ సీఈఓ యం.డి.అమృత్‌రాజ్‌ల చేతుల మీదుగా ఇంద్రావతి సర్పంచ్ సి.సువర్ణ, కార్యదర్శి ఎ.వి.రమణకుమార్, బూదగవి సర్పంచ్ డి.లక్ష్మిదేవి, కార్యదర్శి శ్రీరాములు ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

సూపర్ 60 విద్యార్థులకు మొదలైన ఉచిత శిక్షణ

శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : అభయ, నిస్వార్థ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సూపర్ 60కు ఎంపికైన విద్యార్థులకు నెల రోజుల పాటు కొనసాగనున్న ఏపీఆర్ జేసీ, పాలిసెట్, ఆర్డీటీ సెట్‌ల ఉచిత శిక్షణ కార్యక్రమం సోమవారం పట్టణంలోని స్థానిక లయన్స్‌క్లబ్, స్టడీ, యోగ కేంద్రంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిస్వార్థ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన 60 మందిని నెలరోజులపాటు ఉచిత భోజన సదుపాయంతో కూడి శిక్షణకు ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ఫౌండేషన్లతోపాటు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, కార్యదర్శి బి.లక్ష్మినారాయణ, సభ్యులు యేళ్ల ప్రభాకర్‌నాయుడు, సి.నాగేశ్వరరావు, టి.గణేష్‌బాబు, ప్యాపిలి జయన్న, నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, సంపత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న రెండేళ్ళ బాలుడికి రక్తదానం

రక్తదానం చేస్తున్న ఆపద్బాంధవ ట్రస్టు అధ్యక్షులు వేల్పుల మురళి

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధపడుతూ కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని రాకెట్ల గ్రామానికి చెందిన ధనుంజయ, చిట్టెమ్మ దంపతుల రెండేళ్ళ కొడుకు ప్రజ్వల్‌కుమార్‌కు ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు వేల్పుల మురళి సోమవారం రక్తదానం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్యం మెరుగుపడటానికి అత్యవసరంగా రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించగా కుటుంబ సభ్యులు రక్తదాతల కోసం అన్వేషించినా ఫలితం లేకపోయింది. ఆ విషయాన్ని తెలుసుకున్న వేల్పుల మురళి ఆలస్యం చేయకుండా అనంతపురంలోని చైతన్య రక్తనిధికు చేరుకొని రక్తదానం చేశారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు రక్తదాత ఆపద్బాంధవ ట్రస్టు ఛైర్మెన్ వేల్పుల మురళికు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిను సన్మానించిన తోలుబొమ్మలాట కులస్థులు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరడ్డను సన్మానిస్తున్న ఎంబీసీ తోలుబొమ్మలాట కుల పెద్దలు

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిను సోమవారం తోలుబొమ్మలాట కుల పెద్దలు ఘనంగా సన్మానించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికిగాను మాజీ ఎమ్మెల్యే ఉదయం పట్టణానికి రాగా ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్ ఆధ్వర్యంలో కలిసిన తోలుబొమ్మలాట కుల పెద్దలు మల్లికార్జున, రమేష్, జోగు విజయ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి షాలువాకప్పి పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎంబీసీ బీసీ ఏలో చేర్చడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు.

గుండెపోటుతో రెవెన్యూ అధికారి మృతి

మృతుడు రెవెన్యూ అధికారి గురుదత్త ప్రసాద్ ఫైల్‌ఫోటో

తనకల్లు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని ముళ్లోల్లపల్లికి గ్రామానికి చెందిన రెవెన్యూ అధికారి గురుదత్త ప్రసాద్ ఆదివారం రాత్రి 1:50 నిమిషాలకు గుండెపోటుతో మృతి చెందినట్లు వారి సమీపబందువులు తెలిపారు. వివరాలలోకి వెళితే గురుదత్త ప్రసాద్ నల్లచెరువు మండలంలో సీనియర్ అస్టిటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహించుకొని స్వగ్రామానికి రావడంతో రాత్రివేళ గుండెపోటు రావడంతో వెంటనే మృతి చెందడం జరిగింది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు తెలిపారు.

ఎంపీడీఓ గదిలో నేలపై బైటాయించి రేణిమాకుపల్లి సర్పంచ్ నిరసన..!

-బదిలీ చేసిన నింబగల్లు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ను అక్కడే కొనసాగించాలని డిమాండ్ -బాగా పనిచేస్తున్న వారిని ఇలా బదిలీ చేయడం సరైంది కాదన్న సర్పంచ్ బోయ రామాంజినేయులు

నేలపై కూర్చొని ఆందోళన చేస్తున్న రేణిమాకుపల్లి సర్పంచ్ బోయ రామాంజినేయులుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.చంద్రమౌళి

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : నింబగల్లు గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అహమ్మద్‌ను ఏకపక్షంగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా బదిలీ చేస్తారంటూ అధికార వైసీపీకు (ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వర్గం) చెందిన మండల పరిధిలోని రేణిమాకులపల్లి గ్రామ సర్పంచ్ బోయ రామాంజినేయులు సోమవారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం లోని ఎంపీడీఓ గదిలో సోమవారం నేలపై బైటాయించి నిరసన తెలిపారు. బాగా పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్‌ను సచివాలయ పరిధిలోని ఒక గ్రామానికి సర్పంచ్‌గా వున్న తనకు ఒక్క మాట కూడా చెప్పకుండా ఎలా బదిలీ చేస్తారని ఎంపీడీఓ పి.చంద్రమౌళిను ప్రశ్నించిన సర్పంచ్ అతన్ని నింబగల్లులోనే కొనసాగించేంతవరకు కదిలేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోయ రామాంజినేయులు మాట్లాడుతూ నింబగల్లు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అహమ్మద్‌ను దాదాపు 2 నెలల క్రితం రాకెట్లకు బదిలీచేసి అక్కడ పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఓంప్రకాష్‌ను పామిడికు పంపారన్నారు. ఈ క్రమంలోనే తాను బదిలీపై ప్రశ్నించగా పామిడికు బదిలీ చేసిన డిజిటల్ అసిస్టెంట్‌ను తిరిగి రాకెట్ల సచివాలయానికి రప్పించి అహమ్మద్‌ను నింబగల్లు సచివాలయానికి పంపారన్నారు. అయితే వారం రోజుల క్రితం అహమ్మద్‌ను కొందరు స్థానిక నాయకుల మాటలు విని రాయంపల్లి సచివాలయానికి బదిలీచేసి అక్కడి డిజిటల్ అసిస్టెంట్ సాగర్‌ను నింబగల్లు సచివాలయానికి నియమించారని వాపోయారు. మా డిజిటల్ అసిస్టెంట్ అహమ్మద్‌ను తిరిగి నింబగల్లు సచివాలయంకు నియమించాలని సర్పంచ్ పట్టుబట్టారు. దీంతో మధ్యాన్నం ఎంపీడీఓ చంద్రమౌళి డిజిటల్ అసిస్టెంట్ అహమ్మద్ డెప్యూటేషన్‌ను రద్దుచేసి నింబగల్లు సచివాలయంలోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువరించడంతో వివాదం సద్దుమణిగింది.

గేట్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

పారిశుద్ధ్య కార్యక్రమం చేపడుతున్న దృశ్యం

గుత్తి, ఏప్రిల్ 24, ప్రభాత వార్త : పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం గుత్తి అనంతపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వడదెబ్బ తీవ్రత పట్ల పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వి.కె.పద్మావతి, ఛైర్మన్ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందకచర్లకు ఉత్తమ గ్రామ పంచాయితీ అవార్డు

సర్పంచు ప్రభావతిబాయి

మడకశిర టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండల పరిధిలోని చందకచర్ల పంచాయితీ అన్ని విభాగాలలోనూ అభివృద్ధిని సాధిస్తూ మండలంలో ఉత్తమ గ్రామ పంచాయితీ ఉత్తమ ప్రశంసా పత్రం సర్పంచు ప్రభావతి దేవల నాయక్ అందు

పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ద్విసభ్య కమిటీ

- అందరూ కలిసి కట్టుగా పని చేద్దాం - నియోజకవర్గ అబ్జర్వర్ ముక్తియార్

శింగనమల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

శింగనమల నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణకు తెలుగు దేశం పార్టీ అధిష్టానం ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసిందని నియోజకవర్గ అబ్జర్వర్ ముక్తియార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎం వైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ ముక్తియార్ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పని చేసి 2024లో తెలుగుదేశం పార్టీని గెలిపించి నారా చంద్రబాబునాయుడుకు కానుకగా ఇద్దామని ఆయన పేర్కొన్నారు. ఏదైనా పార్టీ కార్యక్రమంలు నిర్వహించాలంటే కచ్చితంగా టూ మెన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలని, శింగనమల నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ ఎవరూ లేరని, అలా ఎవరైనా పార్టీ కార్యక్రమాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్య లు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎస్ ట్రైనర్, మన టిడిపి ట్రైనర్, ఐటిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఫోల్ మేనేజ్‌మెంట్ టీం సభ్యులు పాల్గొన్నారు. ఓటరు వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్, మన టీడీపీ యాప్‌ల గురించి వచ్చిన వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్ ముక్తియార్

శిక్షణా కార్యక్రమానికి హాజరైన టిడిపి కార్యకర్తలు

ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురి చేయడం తగదు - ఫోర్టో నేతలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

ఫోర్టో ఆధ్వర్యంలో 18 జిల్లాలలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రాల ముంగిట వివిధ రూపాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ సెక్రెటరీ జనరల్ సామల సింహాచలం ప్రకటనలో తెలిపారు. ఇరువేదికల ఉద్యమ కార్యక్రమం విజయవంతంగా ముగిశాయని తెలిపారు. పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలకు హాజరయ్యారని వివరించారు. నేటి ఫోర్టో కార్యక్రమానికి పలు చోట్ల ప్యాప్టో, ఏపిజిఇఏ ప్రత్యక్ష భాగసా ్వమ్యమైందని తెలిపారు. అనంతపురం కెఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల 10వ తరగతి మూల్యాంకన ప్రాంగణం ముంగిట ఫోర్టో ఆధ్వర్యంలో జరిగిన ఫోర్టో కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ కరణం హరికృష్ణ పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలో ఆహ్లాదమైన వాతావరణాన్ని నెలకొల్పకుండా ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేయడం భావ్యమా అంటూ ప్రశ్నించారు. ఎస్ఎల్‌టిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల పర్తి శివానందరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు ఆదిశేషయ్య, వేణుగో పాల్, గిరిజన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శివయ్య, వికలాంగుల ఉపాధ్యాయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న, జిల్లా అధ్యక్షులు వెంకట నారాయణరెడ్డి, బిసిటియు జిల్లా అధ్యక్షులు కిష్టప్ప, తులసిదాసు, వేమయ్య, భాస్కర్ మల్లికార్జున, తిమ్మప్ప, నారాయణస్వామి, కేశవరెడ్డి, రమేష్, సుభాన్, ప్యాప్టో నాయకులు, సిరాజ్, లింగ ్మూర్తి, రమణారెడ్డి, రవీ ంద్ర, వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

నాయీబ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి

- ఉచిత సామూహిక వివాహాల నిర్వహణకు తీర్మాణం

- నాయీబ్రహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు యల్లనూరు ప్రసాద్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిపోయినా నేటికీ నాయీబ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, కావున రాజకీయ పార్టీలు ఈ సారి ఎన్నికల్లో ఎంపి, ఎమ్మెల్యే టికెట్టు కేటాయించి చట్టసభలకు వెళ్లేలా అవకాశం కల్పించాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు యల్లనూరు ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎన్‌జీఓ హోంలో సంఘం ఆధ్వర్యంలో ఐక్య సమ్మేళనం, నూతన నగర కమిటీ ఏర్పాటు చేశారు. యల్లనూరు ప్రసాద్‌తోపాటు ప్రధాన కార్యదర్శి రమేష్ కాంత్, కోశాధికారి రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిస్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించడానికి ఈ ఐక్య సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా కార్పోరేట్ వ్యవస్థ తమ కడుపులు కొడుతోందన్నారు. బ్యూటీషన్ సెలూన్ పేర్లతో తమ వృత్తిలోకి ఇతర కులస్తులు వచ్చి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అలాగే రాబోయే రోజుల్లో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించడానికి తీర్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాలేటి హరి, సాయి, కడవకల్లు వెంకటేష్, నారాయణస్వామి, అమర్‌నాథ్, చిరంజీవి, మంజునాథ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న నాయీబ్రాహ్మణ సంఘం నేతలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి - డాక్టర్ ఫిర్దోష్

శింగనమల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తరిమెల డాక్టర్ ఫిర్దోషి బేగం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ఆర్టిసి బస్టాండ్ వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలవ కుండా చూడాలని, కిటికీలకు, తలుపులకు మెస్ కొట్టించుకోవాలని, మురుగు నీరు చుట్టుపక్కల ప్రాంతాల్లో లేకుండా చూసుకోవాలని ఆమె ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శివప్రసాద్, ఎంపిహెచ్ఈఓ రమణ, గోవిందు, సూపర్‌వైజర్ నాగమ్మ, పుణ్యవతి, ఎంఎల్‌హెచ్‌పి దివ్య, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రైతు భరోసా కొరకు దరఖాస్తు చేసుకోండి - మండల వ్యవసాయ అధికారి చిన్నమ్మ

శింగనమల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

ఇప్పటి వరకు రైతు భరోసా సాయం అందని వారు ఈ నెలాఖరులోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో రైతు భరోసా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్నమ్మ తెలిపారు. మంగళవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి ఖాతాల్లో మే నెలలో ప్రభుత్వం నగదు జమా చేస్తుందని తెలిపారు. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం ప్రతి సంవత్సరం మూడు విడతల్లో 13500 రూపాయలు అందిస్తుందన్నారు.

ఏఓ చిన్నమ్మ

పల్లె ప్రగతి కోసం మీ లోకేష్ కార్యక్రమంలో డేగల

శింగనమల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

పల్లె ప్రగతి కోసం మీ లోకేష్ కార్యక్రమం కర్నూలు జిల్లా ఆధోని నియోజకవర్గం జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా అనం తపురం జిల్లా పార్టీ అధ్యక్షులు కాల వ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జాతీయ పంచాయితీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవి.రాజేంద్ర ప్రసాద్, శింగనమల నియోజ కవర్గం నుంచిటూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పంచాయితీ రాజ్ ఛాంబర్ సభ్యులు డేగల కృష్ణమూర్తిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు శింగ నమల నియోజకవర్గ పరిధి లోని సర్పంచులు మట్లగొంది రమేష్, పెర వలి రాజు, గుమ్మేపల్లి డేగల లలి తమ్మ, నడిందొడ్డి నాగార్జున, గడ్డం నాగే పల్లి నాగన్న, మాజీ సర్పంచులు నారాయణస్వామి, చంద్రమోహన్‌రెడ్డి, ఓబులపతి, వెంకటరాముడు, చెంద్రా యుడు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ మానుల్ చంద్రమోహన్, పెద్ద నాగముని, నిట్టూరు శివాజీ, కోయగూర పెద్దన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌తో డేగల

29న ఆర్డిటిలో జూనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్

ఎస్కేయూ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

ఏప్రిల్ 29న ఉదయం 9 గంట లకు ఆర్డిటి అనంత క్రీడా గ్రామ ంలో జూనియర్ సాఫ్ట్‌బాల్ బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్స్ నిర్వహించబడును. 1-1-2006 పైన జన్మించిన వారందరూ ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులు. ఎంపికైన క్రీడాకారులు అన్నమయ్య జిల్లాలో 26-05-2023 నుంచి 28-05-2023 వరకు జరిగే 10 వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపి యన్ షిప్ పోటీలలో పాల్గొంటారని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ సిఈఓ సి.వెంకటేశులు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షులు ఎన్.శశిభూషణ్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి నాగేంద్ర, అనంతపునరం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోషి యేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సి.వెంకటేశులు

మాంటిస్సోరిలో కిడ్స్ జూబిలేషన్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

స్థానిక సంగమేష్‌నగర్, గుత్తిరోడ్ లోని మాంటిస్సోరి పాఠశాలలో కిడ్స్ జూబిలేషన్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. యుకెజి చిన్నారులు తమ కిండర్ గార్డెన్ విద్యా భ్యాసం పూర్తి చేసుకొన్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాలల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి మాట్లా డుతూ.. కిండర్ గార్డెన్ విద్యాభ్యాసం ప్రతి చిన్నారి విద్యా ప్రమాణంలో అత్యంత కీలకమైన స్థాయి అని, ఈ స్థాయిలోనే వారు విద్యాపరమైన, సామాజిక పరమైన గుణాత్మకతలను పెంపొందించుకుంటారని అంతేకాకుండా ప్రాథమి క విద్యాభ్యాసానికి అవసరమైన నైపుణ్యాలు అలవర్చుకుంటారని తెలియజేశారు. చిన్నారులు, ప్రత్యేక స్నాతకోత్సవ దుస్తులు ధరించి సందడి చేశారు. అనంతరం పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ మనోభావాలు పంచుకున్నారు. చిన్నారులను పాఠశాల కార్యదర్శి కె.మాధవి ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఎ.రమాదేవి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిడ్స్ జూబిలేషన్ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీ చైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్‌డే

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల 9వ బ్రాంచిలో ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే ప్రోగ్రామును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చైతన్య పాఠశాలల అధినేత ఎజిఎం సుబ్బారెడ్డి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశా రు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు, ఆక్టివిటీస్ ద్వారా విద్యను నేర్చుకోవాలి అని తెలియజేశారు. ఈ గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంలో అందరూ విద్యార్థులు ఉల్లాసంగా డాన్సులు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, జోనల్ ప్రైమరీ అకాడమిక్ కోఆర్డినేటర్ పూజ, అకాడమిక్ డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌చార్జ్ చంద్రకళ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్‌డే నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ చైతన్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

నగరంలోని శ్రీ చైతన్య పాఠశాల పామురాయి బ్రాంచ్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడకకు ముఖ్య అతిథిగా ఏజీఎం సుబ్బారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల లో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమానికి సంబంధజంచి ఏజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యను విద్యార్థుల కృషి పట్టుదలతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. అలాగే ఉన్నత విద్యను కూడా విజయవంతంగా పూర్తి చేయాలి అని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కరిముల్లా, రాయుడు, డీన్‌లు ఓబిరెడ్డి, దర్యావలి, ప్రైమరీ ఇన్‌చార్జ్ వంశీ ప్రియ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది.

గ్రాడ్యుయేషన్‌డేలోని దృశ్యం

పాత రేట్లతోనే రెమ్యునరేషన్ చెల్లించండి

పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి ఆదేశం

వార్త ప్రభావం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంకు సంబంధించిన రెమ్యునరేషన్ పాత రేట్లకు సరిపోయే బడ్జెట్‌ను మాత్రమే విడుదల చేయడం జరిగింది. అయితే తాజాగా ఆ రేట్లను పెంచు తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో ఏ రేట్లతో రెమ్యునరేషన్‌ని చెల్లించాలో తెలియక విద్యాశాఖ అధికారులు అయోమ యానికి గురవుతున్నారు. ఈ విషయంపై ఈనెల 25న వార్త దినపత్రికలో రెమ్యునరేషన్ పెంచారు సరే...అదనపు బడ్జెట్ ఏదీ? అనే శీర్షికతో కథనం ప్రచురితం అయింది. ఈ కథనానికి విద్యాశాఖ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి స్పందించారు. ప్రస్తుతం పాత రేట్లతోనే రెమ్యునరేషన్‌ని చెల్లించాలని, పెరిగిన రేట్లకు బిల్లు పెడితే త్వరలో మంజూ రు చేస్తామని, ఆ బిల్లు మంజూరు అయి న అయితే వెంటనే పెరిగిన రెమ్యునరేషన్‌ని కూడా చెల్లించాలని ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే విషయాన్ని ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం డ్యూటీకి వచ్చిన సిబ్బందికి తెలియజేయడం జరిగింది.

రైతులకు రుణాలు అందించాలని సీపీయం ధర్నా

ఆత్మకూరు ఏప్రిల్ 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కెనరాబ్యాంక్ వద్ద మంగళవారం రైతు సం ఘం, సిపియం ఆధ్వర్యంలో రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరు తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏ,పి రైతు సంఘం జిల్లా కార్య దర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులతో పంట రుణాలు రెన్యూవల్ అసలు, వడ్డీ కలిపి కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు రెన్యువల్ చేయాలన్నారు. గత సంవత్సరం వర్షాలు ఎక్కువ కురవడంతో వేరుశెనగ పొలాల్లోనే మొళకలు ఎత్తి పంట పూర్తిగా నాశనం అయిందన్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు రాలేదని, రైతులకు మరింత అప్పులు పెరిగాయని తెలిపారు. బ్యాంక్ అధికారులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి 45 వేల రూపాయలు చొపు ్పన రెన్యువల్ చేసి రైతులను అదుకోవాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరారు. స్పందిన మేనేజర్ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి 45 వేలు రూపాయలు చొప్పున పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రాము, మండల సిపియం కార్యదర్శి శివశంకర్, సిఐటియు మండల కార్యదర్శి జయమ్మ, వలి, సిపియం నాయకులు సరస్వతి, వెంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న సిపియం నాయకులు

రైతులకు పంట నష్ట పరిహారంను అందించి సిఎం జగన్‌రెడ్డి రైతులపట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

- జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని అకాల వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని జనసేన పార్టీ జిల్లా ఉపా ధ్య క్షులు అంకె ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. అనంతపరం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సీఎం జగన్ ఒకసారి అనంతపురం జిల్లాలోని ప్రధాన సమం స్యలపైన దృష్టి పెట్టి వాటి పరిష్కార దిశగా అడుగులు వేయాలని జనసేన పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతపురం జిల్లాకి వెన్న ముఖగా ఉన్న హెచ్ఎల్‌సి కెనాల్ ఆధుఈనకరణ చేయాలని, హెచ్ ఎల్‌సి కెనాల్ సమాంతర కాలువ విషయంలో చొరవ చూపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వెనుకబడిన జిల్లాలకు రావలసిన నిధులు తీసుకు రావ డంలో చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. శింగనమలని యోజకవర్గం లోని సెంట్రల్ యూనివర్సిటీ కేవలం నిర్మాణ గోడలకు మాత్రమే పరిమి తమైందన్నారు.

మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలను తగ్గించాలి

- సీపీఎం నేతలు డిమాండ్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

సీపీఎం పార్టీ ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను తెలుసుకోవడం కోసం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పలు కాలనీలలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి విధానాల వలన ప్రజల పైన భారాలు పడుతున్నాయని అందులో భాగంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకులు భారంగా ప్రజల నడ్డి విరుస్తున్నా యని తెలిపారు. దానికి తగ్గటుగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంటి గుత్తులు, చెత్త పన్నులు, కరెంటు చార్జీలను విపరీతంగా పెంచడంతో ప్రజల యొక్క ఆర్థిక స్థితి దిగజారి పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఒకటవ నగర కార్యదర్శి రామిండ్డి, నగర కమిటీ సభ్యులు ప్రసాదు, ప్రకాష్, మసూద్, వెంకటేష్, బాబు మధ్య తరగతి ఉద్యోగస్తుల సంఘం నాయకులు శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శిలు అంజి, మోహన్, ఫయాజ్, వలీ, పీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

జిల్లా గణిత ఫోరం ఏకగ్రీవంగా ఎన్నిక

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

జిల్లా నూతన గణిత ఫోరంను ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా నూతన గణిత ఫోరం అనంతపురం జిల్లా శాఖను పది మూల్యాంకనం కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతపురం జిల్లా గణిత ఫోరమ్ ప్రధాన కార్యదర్శిగా ఎం.శివప్రసాద్, అధ్యక్షునిగా కె.వెంకటేషులు, గౌరవ అధ్యక్షులుగా నీలూరు రమణారెడ్డి, వెంకట్, గౌరవ సలహాదారులుగా ఈశ్వరయ్య, ఆర్థిక కార్యదర్శిగా దేగావత్ రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా ఎస్.చాంద్‌బాషా, శివశంకర్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎ.ఖాజాబాషా, ఆంజినేయులు, జిల్లా కౌన్సిలర్స్‌గా జయరాంనాయక్, వీరన్న, ఎం.శ్రీనివాసులు, కెవి.శోభన్‌బాబు, చంద్రశేఖర్, ప్రతాప్, మహిళా కార్యదర్శిగా రాధజక, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన శాఖ రాబోవు సంవత్సరంలో గణిత ఉపాధ్యాయులకు పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున వారి సమస్యలను తీర్చడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

నూతన గణిత ఫోరం

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఫ్యాప్టో నిరసన ప్రదర్శన

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూషన్ కేంద్రంలో రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయించిన మేరకు నల్ల బ్యాడ్జీలతో ఫ్యాప్టో పక్షాన నిరసన తెలియజేయడమైంది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మన్యం జిల్లాలో అక్రమంగా సస్పెండ్ చేసిన జిల్లా అధికారులు సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని అనంతపురం జిల్లా స్పాట్ వాల్యూషన్ కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన తెలపడం జరిగింది. అలాగే ప్రవీణ్ ప్రకాష్ వింత వైఖరి మానాలని ఉపాధ్యాయులను సమాజంలో గౌరవంగా చూడాలని ఫ్యాప్టో తరుపున డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 26న స్పాట్ కేంద్రాలలో, పాత తాలూకా కేంద్రాలలో నిరసన తెలియజేయాలని, అనంతపురం జిల్లా ఫ్యాప్టో పక్షాన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రెటరీ జనరల్ లింగమూర్తి, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ నీలూరు రమణారెడ్డి, రవీంద్ర, నాయకులు విరుపాక్షి, రఫి, పులికొండ, రంగస్వామి, బాబ్జీ నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు భగీరథ మహర్షి జయంతి ఉత్సవం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కలెక్టర్ వారి సూచనల మేరకు ఈ నెల 27న ఉదయం 10 గంటలకు శ్రీశ్రీశ్రీ భగిరథ మహర్షి జయంతి ఉత్సవం నగరంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి, ఆర్టిసి బస్టాండ్ కూడలి వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం జరుగుతుందని బిసి వెల్ఫేర్ డిడి కుషూ ్బ కొఠారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, బిసి కులాల చైర్మన్లు, డైరెక్టర్లు, బిసి సంఘ నాయకులు, యావన్మంది ప్రజలు ఆహ్వానితులే అని తెలిపారు.

ఘనంగా జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా మంగళవారం పంచవృత్తుల సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు విబి భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు జగద్గురు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాస ్కర్‌బాబు మాట్లాడుతూ.. 12 ఏళ్ల ప్రాయంలోనే యావత్ భారతదేశాన్ని సంచరించి చతురామ్నాయ పీఠాలను స్థాపించి తన బోధనలతో భరత భూమిని వెలుగులతో నింపిన ఆధ్యాత్మిక తేజోమయ జ్యోతి శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రమౌలి ఆచారి, శోభన్‌బాబు, జగదీష్, ముఖేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతినిర్వహిస్తున్న దృశ్యం

ఇద్దరు టీచర్లకు అంతర్ జిల్లా బదిలీలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 ప్

అర్హులందరి సంక్షేమం సిఎం ధ్యేయం...కాపు

డి.హిరేహాళ్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించి వారిని ఆర్థిక, విద్య, రాజకీయ రంగాలందు అభివృద్ధి చేయడమే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కాపు రామచంద్రారెడి తెలిపారు. సోమవారం డి.హిరేహాళ్ మండలం చెర్లోపల్లి గ్రామంలో కాపు వైకాపా మండల కన్వీనర్ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్ళి ఆయా కుటంబాలకు అందిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించి ఎంత లబ్ది చేకూరిందన్న విషయం లబ్దిదారులకు తెలిపారు. పాలకులం మీ గడపకు వచ్చాం మీరు ఏవైనా సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లైతే తన దృష్టికి అధికారులు ఇక్కడే ఉన్నారు తక్షణం పరిష్కరిస్తానని కాపు తెలిపారు. మీ సంక్షేమం సంక్షేమం కోసం సిఎం జగనన్న ఎల్లప్పుడు మీవెంటే ఉంటారని మీరు కూడా ఆయనకు ఎల్లప్పుడు తోడుగా ఉండాలని అప్పుడే సిఎం శ్రమకు సార్థకత ఉంటుందని కాపు వివరించారు. ఎన్నికల ముందు మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను, పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను నవరత్నాలతో తూచా తప్పకుండా ఒక్కొక్కటిగా అన్ని అమలుపరచి అర్హుల దరిచేర్చారని కాపు గడప గడపలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దారు బసవకుమార్, ఎంపీడీఓ భాస్కర్ బాబు, ఎంఈఓ తిమ్మప్ప, జేఈలు లక్ష్మినారాయణ, హరికృష్ణ నాయక్, వైకాపా జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మెన్ బోజరాజు నాయక్, జేఏసీ కన్వీనర్ రాళ్ళ తిమ్మారెడ్డి, సర్పంచులు పరమేశ్వరప్ప, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున, హనుమంతరెడ్డి, నియోజ కవర్గం యాదవ సంఘం అధ్యక్షులు సురేష్ యాదవ్, వైకాపా నాయకులు పెద్ద ఆంజనేయులు, సింగాడి మంజునాథ్, కల్యం సురేష్, నాగయ్య, పులకుర్తి చంద్రశేఖర్, ఖాశింపీరా, గన్నిగౌడ్, మొండి జయ రామెండ్డి, రవి, తిమ్మనగౌడ్, నరసింహ, బసవరాజు, మంజునాథ, రుద్రేష్, చంద్ర, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైకాపా మద్దతుదార్లు పాలొగన్నారు.

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాపు

ఉత్తమ అవార్డులకు ఎంపికన సర్పంచ్‌లు, కార్యదర్శులను అభినందించి కలెక్టర్

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

జాతీయపంచాయతీ రాజ్ దినోత్సం సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచి ఉత్తమ అవార్డులకు ఎంపికైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శు లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అభినందించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 8 గ్రామ పంచాయతీలు వివిధ పథకాలను సక్రమంగా అమలు పరి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యాయి. జిల్లాలోని బత్తలపల్లి మం డలం అప్పరాచెరువు గ్రామంలో పేదిరకం లేని ఆరోగ్యం మరియు జీవనోపాధి (ప్రాపర్టీ ఫ్రీ అండ్ హెన్‌హెన్స్ లైవ్లీ హుడ్)ని సక్రమంగా అమలుచేసినందుకు సర్పంచ్ శారదమ్మ, పంచాయతీ కార్యదర్శి అలివేలమ్మలకు, చిలమత్తూరు మండలం కొడికొండ గ్రామంలో పిల్లలతో స్నేహపూర్వకంగా (ఫ్రెల్డ్ ఫ్రెండ్లీ) ఉండడంతో సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగరాజును, గోరంట్ల మండలం వానవోలుపంచా యతీ సర్పంచ్ శ్రీరాములు, కార్యదర్శి బాబాజాన్, తనకల్లు మండలం బొంతలపల్లి గ్రామంలో స్పెషల్ సఫీషియంట్ అమలుకుగాను సర్పంచ్ పూలలత, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌ను, నల్లచెరువు మండలం తవలమర్రి గ్రామంలో సోషియల్ సెక్యూర్డ్ అమలుకుగాను సర్పంచ్ మల్లికార్జునమ్మ, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌లను, తలపుల మండలం తలుపుల పంచాయతీలో ఫర్ గుడ్ గవర్నెన్స్ అమలుకుగాను సర్పంచ్ పల్లె శ్రీలత, పంచాయతీ కార్యదర్శి మా ధవ రెడ్డిలను, చెన్నేకొత్తపల్లి మండలంమే డాపురం గ్రామం లో ఉత్తమ ఉమెన్ పంచా యతీ అమ లుకు సర్పంచ్ రా మాంజి నేయులు, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమా ర్‌లను, ధర్మవరం మండ లం గట్టూరు గ్రామంలో సఫిషి యంట్ వాటర్ ఇచ్చినందుకు సర్పంచ్ నరసమ్మ, పంచా యతీ కార్యదర్శి గణేష్‌రెడ్డిలకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేసిన శాలువతో జిల్లా కలెక్టర్ సత్క రించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కొండయ్య, జిల్లా పంచాయతీ అధికారి జి.విజయకుమార్, డిఎల్ డిఓలు శివారెడ్డి, బాలాజీ, శివకుమారి, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ఆర్యవైశ్యుల మరుభూమి ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

- హాజరైన ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
- ఎంపీ నిధులు రూ.15 లక్షలతో ఏర్పాటు కానున్న ప్రహరీ గోడ

ఉరవకొండ, ఏ ప్రిల్ 24 ప్రభాతవార్త

పట్టణ శివారు చాబాల రోడ్డులోగల ఆర్యవైశ్యుల మరుభూమి హరిశ్చంద్ర ఘాట్ ప్రహరీ, ఆర్చ్ నిర్మాణానికి ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఉదయం భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. స్మశాన వాటిక ప్రహరీ, ఆర్చ్ నిర్మాణానికి ఎంపీ తలారి రంగయ్య తన ఎంపీ ల్యాడ్స్ నుంచి 15 లక్షల రూపాయలు కేటాయించిన క్రమంలో జరిగిన భూమిపూజ కార్యక్రమం కొనసాగింది. ముఖ్య అతిధులుగా ఎంపీ, మాజీ ఎమ్మెల్యే స్మశాన వాటిక వద్దకు చేరుకోగానే ఆర్యవైశ్యులు, వైసీపీ శ్రేణులు వారికి డప్పులతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పెద్దలు మాట్లాడుతూ స్మశాన వాటికకు స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసినందుకుగాను ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీనుగ లలిత, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, ఉప సర్పంచ్ జి.వన్నప్ప, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, టౌన్ బ్యాంకు ఉపా ధ్యక్షుడు చంగల మహేష్, ఎంబీసీ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు జోగి వెంకటేష్, కె.గోవిందు, వార్డు సభ్యులు వశికేరి మల్లికార్జున, పద్మావతి, పంచా యతీ కార్యదర్శి ఎ.గౌస్ సాహెబ్, వైసీపీ పంచాయతీరాజ్, బీసీ విభా గాల జిల్లా అధ్యక్షులు యం.బసవరాజు, సి.పి.వీరన్న, ఆర్యవైశ్య సంఘం పెద్దలు చెల్లూరి తిరుపాలొశెట్టి, బుశెట్టి రమేష్, చిత్రాల కామిశెట్టి, జి.నరేంద్ర, చెల్లూరు నాగరాజు, కొంజేటి సురేష్, బద్రి, కందూరు జగదీష్, కల్లూరు జగదీష్, ఉదయ భాస్కర్, కల్లూరు వెంకటేశులు, ఎస్.సి. ఆర్.బాబు, బుశెట్టి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజచేసి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిలను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

శ్రీ నెట్టికంటుని సన్నిధిలో తూ.గో.జిల్లా మండపేట ఎమ్మెల్యే

అత్యాధునిక పరీక్ష పరికరంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ధాతలు.

శ్రీ రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య " విగ్రహంకు నివాళులు అర్పిస్తున్న ధాత కుటుంబీకులు

శ్రీ నెట్టికంటుని సన్నిధిలో తూర్పుగోదావరి జిల్లా మండపేట ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు తదితరులు

గుంతకల్లు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామివారి దేవస్థానంకు శ్రీవారి దర్శనార్థం సోమవారం తూర్పుగోదావరి జిల్లా మండపేట ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సాంప్రదాయానుసారం దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో అర్చక బృందం స్వాగతిస్తూ శ్రీవారి మూలవరుల దర్శనభాగ్యం కల్పిస్తూ ఆయన వంశ గోత్రనామములచే శ్రీవారికి ప్రత్యేక కుంకుమార్చనలతో కూడిన విశేష పూజలను నిర్వహించారు.

తదుపరి ఆయన శ్రీవారికి తన మొక్కులను చెల్లించుకోగా ఆలయ సాంప్రదాయ ఆనవాయితీ మేరకు వేదపండితులు, అర్చకులు సంయుక్తంగా ఆయనకు వేదమంత్రోత్సారణలతో శ్రీవారి ఆశీస్సు లను అందచేశారు. అలాగే దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయం జ్ఞాప కార్థం శ్రీవారి చిత్రపటంతో పాటు శ్రీవారి శేషవస్త్రం తో సత్కరిస్తూ లడ్డు,పులిహోర ప్రసాదాలను వితరణగా పంపిణీ చేశారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే జగన్న లక్ష్యం

- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల

గోరంట్ల,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిం చడమే జగన్న లక్ష్యం అంటూ పెనుకొండ శాసన సభ్యులు మాల గుండ్ల శంకర్ నారాయణ పేరొ్కన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగం గా మల్లాపల్లి పంచా యతీ బుగాని పల్లి,కొత్తపల్లి,బుగాని పల్లి తాండా, మొట్రుపల్లి,కల్లగేరే తాండా గ్రామాలలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి,సర్పంచ్ శివానంద, పాటూరి లక్ష్మిరెడ్డి,ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ దుశ్శాలవతో పూల మాలలతో ఘనంగా సత్కరించి ఆహ్వానించారు.ఈ సంధర్భంగా గ్రామాల్లోని ప్రతి ఇండికి వేళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయ లేదా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే అధికారులతో అక్కడికక్కడే ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ జగనన్న ఇచ్చిన ప్రతి హామీ తూచా తప్పకుండ అమలు చేస్తున్నారని 2024లో భారి మెజారిటీతో గెలిపించుకొని రాష్ట్ర అభివృద్ధికి బాట వేయలన్నారు.ఈ కార్య క్రమంలో ఎంపిపి ప్రమిల మూర్తి,మండల కన్వీనర్ లక్ష్మి నరసప్ప,మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి(సమర) పట్టణ కన్వీనర్ దనుం జయరెడ్డి,వైస్ ఎంపిపి నాగభూషణరెడ్డి,మాజీ ఎపి ఎన్జీఓ ఉపాధ్య క్షుడు సుబ్బారెడ్డి,పంయాయితి రన్వీనర్ మల్లికార్జున,మిక్చర్ కృష్ణరెడ్డి, సర్పంచ్‌లు,సచివాలయ సిబ్బంది, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమ పతకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

వందేళ్లు పూర్తి చేసుకున్న " గుంతకల్లు సర్వజన ప్రజావైద్యశాల "

- అన్నదానంతో పాటు దాదాపు రూ.4లక్షల విలువగల పరికరం ధాతృత్వం చాటుకున్న నాటి ఆసుపత్రి భూ, భవన నిర్మాణ ధాత కుటుంబీకులు - ధాతృత్వ ధాతలను అభినందించి సత్కరించిన ఎమ్మెల్యే వైవిఆర్
- ఎమ్మెల్యేచే ఆసుపత్రిలో వైద్యసేవల ఆపరేషన్ థియేటర్ పునఃప్రారంభం

గుంతకల్లు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

పట్టణంలో పేద ప్రజల ఆరోగ్య వైద్య సౌకర్యాల కల్పన సేవలకై నాడు భూ విరాళంగాను ఆసుపత్రి భవన నిర్మాణ ధాతగా దాదాపు రెండున్నర ఎకరాల మేర ధాతృత్వం ప్రకటించిన " శ్రీ రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య " 1923వ యేడాదిలో " గుంతకల్లు సర్వజన ప్రజావైద్యశాల " ఏర్పాటుతో ప్రస్తుత 2023 యేడాదికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గుంతకల్లు పట్టణానికే గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డితో పాటు నాటి ధాత కుటుంబీకులు ఉద్ఘాటించారు. సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ అధ్యక్షతన నాటి ఆసుపత్రి భూ విరాళ భవన నిర్మాణ ధాత కుటుంబీకులు పలువురు రోగులకు గాను వైద్య పరీక్షలలో భాగంగా అత్యంత ఆధునాతన హెమటాలజీ అన్‌లైజర్ పరికరం ధాతృత్వంగా అందచేస్తూ సదరు పరికరం సద్వినియోగంకై ముఖ్యఅతిథిగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మెన్,గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని ఆహ్వానించి ఆయనచే ప్రార ంభించారు. ఈక్రమంలోనే ప్రార ంభం సూచనగా సదరు పరీక్షల నిర్వాహక సిబ్బంది ఎమ్మెల్యే యొక్క రక్తం సేకరణతో రక్తకణముల పరీక్షల నిర్వహించడం అందులో భాగంగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని గుర్తించి ఆయా పరీక్షల రిపోర్టుల నివేదికలను అందచేయడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ధాతలుగా ముందుకు వస్తూ పేదల పాలిట ఓ వరంగా తమతమ ధాతృత్వంను చాటుకుంటున్న తీరు అభినందనీ యమన్నారు. ఆర్థికంగా పేదల పాలిట శాపంగా మారుతూ ప్రస్తుత వైద్య ఆరోగ్య పరిస్థితులు విషమంగా ఉండటం దయనీయంగా ఉంటున్న తరుణంలో ధాతలు తమ ధాతృత్వంను చాటుతూ పేదల పాలిట ఓ వరంగా వారు అందిస్తున్న ధాతృత్వ సహకారంను స్వాగతిస్తున్నామన్నారు. గత వందేళ్ల క్రితం " శ్రీ రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య " గారి ధాతృత్వం నేటి వరకు గుంతకల్లు పట్టణంకే కాకుండా చుట్టు ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తూన్న తీరు నాటి ధాత సహకారం నేడు వందేళ్లు పూర్తి చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. నాటి ధాత సూర్తితో ఆయన కుటుంబీకులు విదేశాలలో జీవనం సాగిస్తూ ఎన్ఆర్ఐలుగా ప్రస్తుతం వరకు ధాతలుగా ఆసుపత్రికి అందిస్తున్న సహకారంలో భాగంగా ఆసుపత్రి నిర్మాణం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పుం ్కరించుకుని దాదాపు రూ.4లక్షల విలువగల డెం గ్యూ లక్షణాల నిర్ధారణ పరీక్ష (రక్త కణాలు అంచనా వేయు అత్యాధునిక యంత్రం) " హెమటాలజీ అన్‌లైజర్ " పరికం ంను అందించి మరింత ధాతృత్వంను చాటుకున్న తీరు అభినంద నీయమన్నారు. ఈక్రమంలోనే ఆసుపత్రి ఆవరణలో ఉన్న భూ విరాళ భవన నిర్మాణ ధాత " శ్రీ రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య " విగ్రహంకు ఆయన కుటుంబీకులు పూలహారం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి ఆసుపత్రి అవరణ లోను, ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులకు, సహాయకులకు, రహదారిలో పాదచారులైన ప్రజలకు అన్నదాన కార్యక్ర మంను చేపట్టారు. ఇదిలా ఉండగా ఆసుపత్రి అభివృద్ధి పనులలో భాగంగా నూతన భవనాల నిర్మాణ దశలో ఉన్న పరిస్థితులు దాదాపు గత రెండేళ్లుగా ఆపరేషన్ థియేటర్ మూసివేయగా ప్రధానంగా ప్రసూతి విషయంలో వివిద వైద్య ఆరోగ్య సేవలుగా వివిద ఆపరేషన్లు నిలిచిపోవడం పేద రోగుల పాలిట శాపంగా మారిన వైనం ఉండేది. ఆసుపత్రిలో వైద్య సేవలను అందిస్ున్న వైద్య ఆరోగ్య సిబ్బంది తమ పనితీరులో " మంచి జరిగితే తమదే విజయం " మానవత్వం చాటా మన్న భావనగా అంటారని, " చెడు జరిగితే దేవుడు సహకరించలేదని " బాహాటంగా పేర్కొంటున్నారన్న ఆరోపణల పలు విమర్శలు లేకపోలేదు. ఎట్టకేలకు సోమవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆపరేషన్ థియేటర్ పునఃప్రారంభించడంతో ప్రస్తుతం పేదప్రజలకు ఓ వరంగా మారింది. కాగా ఆసుపత్రి భవన నిర్మాణపు పనులు ప్రస్తుతం వరకు కొనసాగుతున్న తీరుండగా ఏమేరకు వైద్య ఆరోగ్యం ఆపరేషన్లు సఫలీకృతమయ్యేనో వేచిచూడాల్సిందే.

ఆసుపత్రి వద్ద రహదారిలో అన్నదానం నిర్వహిస్తున్న ధాత కుటుంబీకులు.

సత్యసాయి ఆరాధనోత్సవం...తరించిన భక్తజనం

- వేలాదిమందికి అన్న, వస్త్రదానం

ప్రత్యేక అలంకరణతో ప్రశాంతి నిలయం

మహానారాయణ సేవలో పాల్గొన్న భక్తజనం,

అన్నవస్త్రాలు అందజేస్తున్న ఆర్.జె.రత్నాకర్

పుట్టపర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

సాయి నామస్మరణతో అనంతభక్తకోటి తరించింది... సత్యసాయి ఆరాధన మహోత్సవం సందర్భంగా ప్రశాంతి నిలయం భక్తజన సంద్రమైంది. బాబా తన అవతారం చాలించి పుష్కర కాలం గడించి తమ ఆరాధ్య దైవం భౌతికంగా లేరన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేక బరువెక్కిన బాధాతప్త భక్త హృదయాలు ఆత్మస్వరూపుడై అందరితో ఉన్నారన్న భావనను వెలిబుచ్చారు. ఆయనను స్మరించుకొని ఆయన చూపిన మార్గమే పరమావ ధిగా సంకల్ప బలంతో ముందకెళ్ళడమే సాయిభక్తుల ముందున్న లక్ష్యమని సత్యసాయి భక్తులు నాగానంద భక్తులను ఉద్దేశించి అన్నారు. సత్యసాయి సన్నిధి ప్రశాంతి నిలయం బాబా మహాసమాధి ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. దేశవిదేశీ భక్తజనం ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. వేదపఠనం, భక్తిగేయా లపనతో బాబా అవతార వైభవాన్ని స్మరించుకున్నారు. బాబా ప్రసంగాన్ని సభికులకు వినిపించారు. మహామంగళ హారతి ఇచ్చి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

వేలాది మందికి అన్న, వస్త్రదానం :

మహానారాయణ సేవ ద్వారా వేలాది మందికి అన్న, వస్త్రదానం చేశారు. శ్రీ సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో స్త్రీ పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. బాబా చిత్రపటానికి ట్రస్ట్ ప్రతినిధులు ఆర్.జె.రత్నాకర్, చక్ర వర్తి, నాగానంద, జె.వి.శెట్టి, నిమిష్ పాండ్య, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించి నారాయణ సేవ ప్రారంభించారు. లడ్డు, పులిహోర, మజ్జిగ, నీరు, చీర, ధోవతులు అందజేశారు. సుమారు 40 వేల మంది భక్తులకు వీటిని పంపిణీ చేశారు. శ్రీసత్య సాయి సేవా వాలంటీర్‌లు క్రమశిక్షణతో భక్తులకు అన్ని అందేలా సేవలు అందించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థల ప్రతినిధులు కోటేశ్వర్‌రావు, చలం, లక్ష్మణరావు, సాయిభక్తులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి

ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు మహేశ్వర్‌రెడ్డి

లబ్దిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

లబ్దిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

నల్లచెరువు, ఏప్రెల్ 24, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఓరువాయి సచివాలయ పరిధిలోని సోమవారం మారిశెట్టిపల్లి, చెరువువాండ్లపల్లి గ్రామాలలో ఎమె ్మల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యేకు వైసిపి నాయకులు, గ్రామస్థులు, మహిళలు పూల మాలలు, హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇం టికి వెళ్ళి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిష్క రించ దగ్గ సమస్యలు పరిష్కరించారు. గ్రామంలో అవసరమైన చోట విద్యు త్ స్థంభాలు వేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అసైన్‌మెంట్ భూములు సాగంలో ఉన్నవారికి పట్టాలిప్పి ంచాలని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డి వివక్షకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వాలంటీర్‌ల ద్వారా సంక్షేమ పథకాలను అందివ్వడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడన్నారు. గత ప్రభుత్వానికి జగన్‌మోహ న్‌రెడ్డి ప్రభుత్వానికి తేడాను గమనించాలని,ప్రజలు మళ్ళీ జగన్‌మో హన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎ ్పి రమణారెడ్డి, వైస్ ఎంపిపి నారాయణస్వామి, భళారపు రామలక్ష్మి,బీసి సేట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్, సహకార సంఘం అధ్యక్షులు కుర్లి జయచం ద్రారెడ్డి, అగ్రికల్చర్ సలహాదారుడు తాటచెర్ల ముస్తఫా, కోఆప్షన్ సభ్యులు బట్టి హైదర్‌వలి, పోరెడ్డి వెంకటరెడ్డి,జేఏసి ఇన్‌చార్జ్ రాజశేఖర్‌లు, ఎంపిటి సిలు, భాస్కర్‌రెడ్డి,సద్దపల్లి రఫీ, సర్పంచ్‌లు గంగాదేవి, యూసఫ్, శ్రీనాథ్‌రెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవికు మార్‌రెడ్డి,అక్బర్, రఫీ, లైన్‌మెన్, వాలంటీర్‌లు, వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మే 2న ప్రధాని మోదీ హొస్పేటకు రాక

- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర బీజేపీ నేతల విస్తృత ప్రచారం...
. జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహరగౌడ

బళ్లారి, ఏప్రిల్24, ప్రభాతవార్త ; కర్ణాటక విధానసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థులపరంగా ప్రచారం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 2న విజయనగర జిల్లా హొస్పేటకు రానున్నట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు గోనాళ్ మురహరగౌడ తెలిపారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారంనాడు పత్రికాగోష్ఠిలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలోని అన్ని 224 అసెంబ్లీ క్షేత్రాల్లో భారీస్థాయిలో ప్రచారం చేపట్టేందుకు జాతీయ బీజేపీ నాయకులతో పాటు రాష్ట్రస్థాయి సీనియర్ నాయకులు సైతం పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రతి పది నియోజకవర్గాలు కలిపి ఒకచోట సభ జరపనున్నారు. ఆ ప్రకారం బళ్లారి, విజయనగర జిల్లాలతో కలిసి హొస్పేటలో బీజేపీ ఆధ్వర్యంలో బృహత్‌సభలో పాల్గొని అభ్యర్థుల పరంగా ప్రసంగిస్తారని చెప్పారు.

– నేడు బళ్లారికి క్రిష్ణపాల్‌గుజ్జర్ రాక : బళ్లారి సిటీ, రూరల్ విధానసభ ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల ప్రచారానికై స్టార్ ప్రచారకులైన కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి క్రిష్ణపాల్‌గుజ్జర్ మంగళవారంనాడు బళ్లారికి రానున్నట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహరగౌడ తెలిపారు.

రెండు రోజులపాటు ఆయన ప్రచారకార్యంలో పాల్గొంటారు. ప్రధాన నరేంద్రమోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీలు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార పర్యటనలో పాలుపంచుకోనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో శిరుగుప్ప క్షేత్రం ప్రచారానికి బీజేపీ ఓబీసీ జాతీయమండలి అధ్య క్షుడు లక్ష్మణ్ సందూరు క్షేత్రానికి మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేంద్రరెడ్డి, బళ్లారి రూరల్ క్షేత్రానికి వై.ఎం .సతీష్, కంప్లీకి మాజీ ఎంపీ జె.శాంతలు ప్రచార కార్యంలో రెండు రోజులపాటు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి బసవరాజ బొమ్మై, మాజీ సీఎం బి.ఎస్. యడియూరప్ప, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్‌కుమార్‌కటీల్‌లు కూడా ప్రచారంలో పాల్గొంటారు. తెలుగు చలనచిత్ర ప్రముఖ నటులు పవన్‌కళ్యాణ్, కన్నడ నటులు సుధీప్, దర్శన్‌లు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. గుజరాత్, ఉత్తరప్ర